# పోంగరంగడు

కవ్వగంతుల సత్యనారాయణ

౧

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ' అను వాక్యములో హిమాలయమంత సత్యమున్నది. జననియందును, జన్మభూమియందును అనుభవించి యానందింప తగిన అమృతమున్నది.

అమ్మ అమృతమయి.

అమ్మ యను శబ్దములో నమృతమున్నది. అమ్మను చూచుటలో నానందమున్నది. అమ్మతో మాట్లాడుటలో హాయియున్నది. అమ్మసామీప్యమున స్వర్గమున్నది.

మన పురోభివృద్ధికొరకు దైవమునకా మెయొనర్చు మ్రొక్కు లనిర్వచనీయములు. అమ్మహృదయము నవనీతమయము. మననుండి ప్రతియేమియును కోరి, ఆమె మనలను తొమ్మిదినెలలు మోయలేదు. రెక్కలు వచ్చు వరకును కాపాడలేదు. ఆమెనుండి అమృతరూపమున ప్రేమ వర్షించినది. అంబుదమేమి వాంఛించి యమృతమును వర్షించినది! అది స్వాభావికము. ప్రకృతిధర్మము.

'మాతృహీన శిశుజీవనం వృథా!'

తల్లిలేనివాని జీవిత మంధకారమయము. అది పూడ్చుటకు వీలులేని లోటు. తల్లిలేనివాడు దరిద్రాధముడు.

౨

ఆరవయేట పోయిన అయ్యను మరచి ప్రజలలో పడేటప్పటికి రంగడికి పదకొండోయేట అమ్మచావుకూడా నెత్తినబడింది. వాడికళ్లు చీకట్లుకమ్మాయి. కట్టెలాగ పడివున్న తల్లి శవముమీదపడి గంటలకొలది యేడ్చాడు. కళ్లు యెర్రబడునంతవరకు నీళ్లుకారినవి. ఇంక నాయనవారెవరూ యీ ప్రపంచములో లేరు రంగడికి.

దానికాలముతీరి వెంకి చచ్చిపోయినది. ప్రపంచానికీ దానికీ సంబంధము తీరిపోయింది. ఉన్నన్నాళ్లూ ప్రపంచముకోసము వెంకీ, వెంకికోసము ప్రపంచమూ పూసలాడారు. ఇప్పుడు ప్రపంచపుగొడవ వెంకికి లేదు. వెంకిగొడవ ప్రపంచమునకు లేదు. కొద్దిగా ఎఱిగినవాళ్లు 'చచ్చిపోయినదా' అన్నారు. బాగా యెఱిగినవాళ్లు అయ్యోఅన్నారు. ఎక్కువ పరిచయముండి దాని మంచి గుణాలకి సంతోషించినవారు కంట తడిబెట్టారు. అంతే. ఆకాస్తతో వెంకిమాట ప్రపంచము మరిచిపోయింది. ప్రపంచమును వెంకి మరచినదో, లేదో బ్రతికున్నవాళ్లెవళ్లూ చెప్పలేరు. వెంకి చచ్చిపోయినందువల్ల రంగడికీ, రెండురూపాయలపైచిల్లర అప్పయిచ్చిన కోమటాయనకీ తప్ప మరెవరికీ యేమీ నష్టం కలుగలేదు. వెంకి బ్రతికున్నపు డెలానడిచిందో, చచ్చిపోయిన తరువాతకూడా ఆలాగే నడిచింది ప్రపంచము. వెంకి బ్రతికివుండగా దానియింటిమీద యెంతయెండకాసేదో ఇప్పుడూ అంతే కాసింది. దాని వాకిటిముందునుంచి మునుపునడిచినట్లే ప్రజలునడిచారు. పైన రేయుళ్లూ, క్రింద ప్రజలూ కూడా వెంకిచావువల్ల మార్పుపొందలేదు. ఎవరు చచ్చినా అంతే.

ఇరుగుపొరుగు కులస్థులంతా తల్లిని మట్టిచేసినదాకా సహాయముచేశారు రంగడికి. అందరూ తలొక రోజు 'మాయింట్లోతినురా' అని భోజనం పెట్టారు. నెలల తరబడి యెవరూ పెట్టరు. వాడి కేమీ దారితోచలేదు.

వెంకిమగడు పొగాకుకంపెనీలో చాలాకాలము నమ్మకంగా పనిచేసి దొరమెప్పును సంపాదించాడు. మొగుడుచచ్చినతరువాత వెంకి వడ్లు దంచీ, పిండివిసరీ, అటుకులుకొట్టీ, రోజు తెచ్చినడబ్బుతో ఆరోజు గడపుతూ, మొగుడు తన కప్పజెప్పిపోయినరంగడ్ని పోషించుకుంటూ కాలంగడిపింది. ఇరుగువారూ, పొరుగువారూ ఆహా అంటే ఆహా అనేటట్టుగా నడిచింది. తనపనేమో, తనగొడవయేమో, అంతేగాని పరాయిగొడవలేకుండా,

తనకీ చచ్చిపోయిన తనమొగుడికీ కూడా అప్రతిష్ఠ లేకుండా సంచరించి చచ్చిపోయింది వెంకి.

ఆడదానికి బుద్ధిమంచిదయితే ఏకులం దయినా తక్కినవాళ్లంతా దానిచుట్టూ దిగదుడుపే.

ఊహారానికాలంలో జీవితోపాధి వెతుక్కోవలసివస్తే యేంజేస్తాడురంగడు. ఎలాతెచ్చిందో, యెలాపెట్టిందోతల్లివున్నన్నాళ్లూ తన కేలోటూలేకుండాచేసిపోయింది. ఇప్పుడు అన్నముపెట్టమని అడగటానికీ, మంచినీళ్లుయిమ్మని అడగటానికీ, మారామాచెయ్యడానికీ ఏదీ—ఆ అమ్మ. బావురుమంటూ వున్న ఆకుడిసెకేసి చూడ్డంతోటే, కెరటాలలాగ తెళ్లుకొని వచ్చేది దుఃఖము రంగడికి. ఏడ్చిఏడ్చి తనకుతానే ఓదార్చుకునేవాడు.

చుట్టుప్రక్కలవాళ్ల సలహామీద, పగిలిపోయిన కుండపెంకు వొకటి నెత్తినబెట్టుకొని, పాతబిచ్చగాళ్లల్లో కొత్తబిచ్చగాడై ముష్టిఆరంభించాడు రంగడు. వేసినమ్మ వేసింది. వెయ్యనమ్మవెయ్యలేదు. ఒక్కొక్కరోజు తను దినగా, కుక్కకి వెయ్యడానికికూడా మిగిలేది అన్నం. చాలకపోయినా అంతే; చాలినాఅంతే. ఇంకొంచెం పెడతా తినమని బలవంత పెట్టడానికి వాళ్లఅమ్మ ఏది!

రంగడికి కడుపునిండినరోజులు కొద్ది.

3

రావుసాహేబు రంగయ్యనాయుడికి ఒక్కడే కొడుకు. చాలాకాలానికి పుట్టటంచేత అతిగారాబముగా పెంచుకున్నారు. శ్రీమంతులబిడ్డలు అసలేగారాబముగా పెరుగుతారు. ఆందులో చాలకాలము తల్లిదండ్రులను మురిపించిపుట్టే బిడ్డల ముద్దుముచ్చటలు చెప్పక్కర్లేదు. కావాలనటం తరువాయిగా, చూసినవస్తువల్లా వారిదై పోతుంది. అపురూపపువస్తువులు, వాళ్లు ఆడుకొని పాడుచేస్తారు. ఆవస్తువులు బీదవాళ్లపిల్లలకళ్లకి దేవతారూపాలు.

రంగయ్యనాయుడికొడుకును రోజూ షికారు తీసికెళ్లడానికి యెక్కించే తొట్టిబండి రంగడికళ్లకి R 101 విమానంకన్నా, మాగ్జిగోర్కీ విమానంకన్నా మహత్తరంగావుండేది. తనచిన్ననా డెన్నడేనావాడలాంటి దెరుగునూ! వెంకినడుమే వాడికి అన్ని విమానాలూ అన్ని మోటార్లూనూ. ఇప్పుడదికూడా కలువై పోయింది,

రంగడు యెన్నోసార్లు రంగయ్యనాయుడి యింటికి కబళానికి వెళ్లాడు. వీధిగుమ్మందగ్గిరకి పోయినప్పుడు బంట్రోతు బెత్తం వడ్డించేది వాడికి. దొడ్డిగుమ్మాన వెళ్లినప్పుడు మాత్రం వేళకివెళితే రెండుమెతుకులు దొరికేవి. లేకపోతే గుమ్మమే జవాబుచెప్పేది.

ఆవాళ రంగయ్యనాయుడికొడుక్కి నాలుగోయేడు వచ్చింది. పుట్టినరోజు పండగచేస్తున్నారు. తలంటినీళ్లు పోసి మొఖమల్ కోటూ, లాగూ తొడిగి వంటినిండా మోసినన్ని బంగారంవస్తువులు తగిల్చారు కుర్రాడికి. అమ్మదగ్గిరనుంచి నాన్నదగ్గిరకీ, నాన్నదగ్గిరనుంచి చూడవచ్చిన చుట్టాల దగ్గిరకీ నవ్వుతూ పలుకుతూ కులుకుతూ తిరుగుతున్నాడు కుర్రాడు. సాయంత్రము స్నేహితులందరికీ పెద్ద టీపార్టీ చేసే ప్రయత్నంలో వున్నాడు రంగయ్యనాయుడు.

గుమ్మాలకికట్టిన మామిడితోరణాలూ, వాకిట్లో వాయించే మేళాలూ చూసి, బిచ్చగాళ్లు విధివిరామము లేకుండా వస్తున్నారు. గేటుదగ్గిరనుంచే, బంట్రోతు వాళ్లని వెళ్లగొట్టేస్తున్నాడు. అవును. అంతటిశుభకార్యంలో వాళ్లువుంటే యీదరిద్రులగతి యెవడిక్కావాలి. రంగయ్యనాయుడికి యీ నిర్భాగ్యులసంగతి విచారించటము తప్ప మరి పనేమీలేదూ! అసలు - దరిద్రులనేవారున్నారు. వారు రోజుకి వొకపూటకికూడా లేకుండా మాడుతున్నారన్న సంగతి అతనికితెలుసునా అని? ఏమంటే, దరిద్రమూ, తలనొప్పి, ఈరెండిటిబాధా అనుభవించే వాళ్లకి తెలియాలి చూసేవాళ్లకీ, వినేవాళ్లకీ తెలిసేది ఏమీలేదు.

రంగయ్యనాయుడి యింట్లో జరిగే వుత్సవము రంగడి నక్కడికి లాక్కొచ్చింది. బంట్రోతు రెండు మూడుసార్లు వెళ్ళగొట్టినా వుండుదగ్గరి యీగలాగ, రంగడు సందుదొరికితే లోపలదూరటానికి, చుట్టుప్రక్కలనే తిరుగుతూ వుండిపోయాడు. సరిగ్గా రెండుఝాములయేసరికి వాడికి వీలుచిక్కింది. బంట్రోతు అన్నానికి కాబోలు లోపలికి వెళ్లిపోయాడు. బంట్రోతు లోపలికి

పోగానే రంగడుకూడా మెల్లిగా లోపలికి జారాడు; వంటయింటివైపు పోవాలంటే మేడకీ, ప్రహారీగోడకీ మధ్యనున్న తోటలోంచి పోవాలి. దిక్కులుచూస్తూ, బెదురుతూ రంగడు తోటలోకి ప్రవేశించాడు తోటలోని మొక్కలికి నీళ్లకోసం. మోటబావి త్రవ్వించాడు రంగయ్యనాయుడు, ఆ మోటబావి దగ్గరకివెళ్లి, నారింజచెట్టు దగ్గిర నిలుచున్నాడు రంగడు ఆలోచిస్తూ. ఇంతలో రంగయ్యనాయుడికొడుకు జిలేబీపొట్లంచేత్తోపట్టుకొని, కొంచెముకొంచెము తినుకుంటూ బావిసమీపంగా వెళ్తున్నాడు వాకిలివేపుకి. కుర్రాడిచేతులో పొట్లం రంగడికి నోట్లో నీళ్లూరించింది. ఆపొట్లం లాక్కొని ఒక్క పరుగున బజారులోనికి పరుగెత్తడానికిఆలోచిస్తున్నాడు రంగడు. దానికి అనుకూలంగానే కుర్రాడు బైలుకి వెళ్లవలసివచ్చినదో యేమో, పొట్లం ఒకచెట్టుకింద బెట్టి, లా పబొత్తాములు రెండుచేతులతోటే తీసుకుంటూ, యింకో చెట్టుచాటుకి వెళ్లాడు. వీలుచిక్కగానే, ఆపొట్లాన్ని లంకించుకొని, ఒక్కపరుగుదీశాడు రంగడు.

౪

'దొంగ, దొంగ; పట్టుకో పట్టుకో' అని కేకలువేస్తూ, రంగడివెనుక పరుగెత్తుతున్నాడు రంగయ్యనాయుడి బంట్రోతు. గబగబ పరుగెత్తుతూ, గేటులోనుంచి అవతలికి పరుగుదీస్తూ వున్న రంగడిని చూసి, అప్పుడే అన్నముతిని చెయ్యికడుగుకొంటూవున్న బంట్రోతుకు అనుమానంవేసింది. చేతులోవున్న చెంబు అక్కడేపడవేసి, రంగడివెనక పరుగు ఆరంభించాడతను. చావుబ్రతుకులకు తెగించి ముందు పరుగెత్తుతున్నాడు రంగడు. 'దొంగ, దొంగ, పట్టుకో, పట్టుకో' అని కేకలువేస్తూ పరుగెత్తుతున్నాడు బంట్రోతు. వాడు వేసే కేకలకు బజారంతా వొక్కసారి వులిక్కిపడ్డది. 'దొంగ' అనడంతోటే ప్రతిమానవునికీకూడా ఒకవిధమైన యేవగింపు. పరుగెత్తుతూవున్న దొంగని పట్టుకుందుకు తయారయే మొగాళ్లు తక్కువగా వున్నా దొరకిన దొంగని తన్నటానికి అంతా మొనగాళ్లే. దొరకని దొంగకూడా 'వెధవపనిచెయ్యకపోతే బ్రతకలేవూ' అంటూ వొక కుమ్ము కుమ్ముతాడు దొరికినదొంగని.

'దొంగ, దొంగ, పట్టుకో పట్టుకో' అని బంట్రోతు రంగడివెనకాల కేకలువేస్తూ పరుగెత్తడం బజారులోవాళ్ళందరి నరాలనీ వొక్కపెట్టున కంపింపజేసింది. కిల్లీకొట్టువాడు తనదుకాణమువదలి పరుగుఆరంభించాడు దొంగను పట్టుకోడానికి. గుర్రబ్బండి సాయెబు బండిని అక్కడేవదలి పరుగెత్తాడు దొంగను పట్టుకోడానికి. మిఠాయిఅంగడివద్ద శేరు మిఠాయికొని పొట్లం తనచేతులో వుంచుకొని, డబ్బులకోసం జేబులో చెయ్యిబెట్టిన ఒకఆసామీ, చెయ్యిజేబులోనే వుంచి పరుగెత్తాడు దొంగను పట్టుకోడానికే కాబోలు. అవకాశమున్నవాడల్లా పరుగెత్తాడు దొంగనుపట్టుకోడానికి.

'దొంగ' అనగానే హడిలిపోయినవాళ్లున్నారు. 'బేరానికి వచ్చినవాళ్లలో వున్నాడేమో ఆదొంగ' అని చిల్లరదుకాణపుకోమటి రెండుమూడు నిముసాలు బేరగాండ్లనుచూస్తూ కూచున్నాడు నిలువుగ్రుడ్లేసుకొని. అప్పుడే భోజనముచేసి బయటికివచ్చిన శాస్త్రిలుగారొకరు ఘడేలుమని వీథి తలుపేసుకొని యింట్లోకిపోయినాడు. కాఫీహోటలుఅయ్యరుతోటి సరసమాడుతూ నిలుచున్నగొల్లచాన త మెళ్లో పట్టెడను కుడిచేత్తో గట్టిగాపట్టుకొని పక్కకుతొలిగింది.

ఒకడింకొకడుకలసి పాతికమంది పోగై తరుముతున్నారు. అందరికేకలకి రోడ్డంతా ప్రతిధ్వనిస్తోంది. వెనక్కితిరిగిచూడకుండా, ప్రాణాలు అరచేతులో పట్టుకొని, చావుబ్రతుకులు తెలియకుండా పరుగెత్తుతున్నప్పటికీ, చేతిలోపొట్లంమాత్రం విడిచిపెట్టలేదు రంగడు. ఎద్దులలాంటివాళ్లు తరుముకొనివస్తుంటే, ఎంతదూరము దాటిపోగలడు కుర్రవెధవ! వెనక్కు తిరిగి చూశాడు. గుండెలు అదిరాయి. కాలికి రాయితగిలి 'దబ్బు'మని క్రింద పడ్డాడు కంకరరోడ్డుమీద. చేతిలోవున్నపొట్లం క్రిందబడి, జిలేబీ రోడ్డుమీద చెల్లాచెదరైపోయింది. బోర్లపడినందుచేత మొహం చెక్కలుపోయింది. రంగడికి రక్తం చిమ్మింది కొంచెం. తిండిలేక యెండి కట్టె అయిన ఆశరీరములోంచి ధారగా కారేటంత నెత్తురువుంటేగా. నేలమీదపడ్డంతోటే వాడికి స్పృహతప్పి పోయినది. వెనకనుంచి తరుముతూవస్తూవున్న మూక అంతా ఆగింది.

బంట్రోతు పడివున్న రంగడిని పట్టుగానే రెండు బాదాడు. ఆదెబ్బలచురుకు రంగడికి తగిలిందో లేదో, వాడు మాత్రం లేవలేదు, కదల్లేదు. అంతా కలిసి లేవదీశారు. దగ్గరవున్న కొళాయికిపోయి, కిల్లీదుకాణదారు దోసిలితో నీళ్లుతీసికొనివచ్చి రంగడిమొహాన చల్లాడు నాలుగైదుసార్లు.

తెలివివచ్చినతరువాత బాదుకుంటూ రంగయ్యనాయుడియింటికి తీసుకొనివెళ్లారు రంగడిని. తీరికవున్నవాళ్ళంతా వెంబడించారు పర్యవసానంచూడటానికి.

౫

రంగడూ, రంగయ్యనాయుడుగారియింటికి వెళ్లకపూర్వమే ఆతోటలో ప్రవేశించిన వ్యక్తి యింకొకడు వున్నాడు. ప్రొద్దున్న తొమ్మిదిగంటలకు, బంట్రోతు యేదోపనిమీద యింట్లోకివెళ్లినప్పుడు, లోపలికివెళ్లాడా వ్యక్తి. రంగడికంటే అధమం యిరవై సంవత్సరాలయినా పెద్దఅయిన ఆ వ్యక్తివుద్దేశముకూడా చేతికి దొరకినదేమైనా పట్టుకుపోదామనే. చప్పుడుకాకుండా తోటలోకివెళ్లి, గుబురుగా వున్న వొక చెట్టుయెక్కి కూచున్నాడు గంటలకొద్దీ కూచున్నాడు, ఏమయినా అవకాశముదొరికి, కాస్తయేమయినా లాభిస్తుందేమోనని. పండ్రెండుగంటలకి రంగడు మెల్లిగా అడుగులు వేసుకుంటూ తోటలోకిరావడ మావ్యక్తిచూశాడు. వాడు మోటబావిప్రక్కన దాగుకొని పొంచివుండటం చూశాడు రంగయ్యనాయుడికొడుకు జిలేబీపొట్లం తింటూ, బావిప్రక్కకువచ్చి పొట్లంక్రిందపెట్టి, మరొకచెట్టుక్రింద బైలుకికూర్చోవడం చూశాడు. ఆపొట్లం తీసుకొని రంగడు పరుగెత్తడం చూశాడు. రంగయ్యనాయుడికొడుకుమెడమీదవున్న బంగారపునగలు ఆ వ్యక్తిమీద సమ్మోహనాస్త్రము వేశాయి. చెట్టుమీదనుంచి క్రిందిగిదిగి, వెనకనుంచివెళ్ళి కుర్రాడిమెడ రెండుచేతులతోటీ పట్టుకొని మెలిదిప్పాడు. కుర్రాడు కిక్కురుమనకుండా ప్రాణాలు వదిలేశాడు. ఇలాటి కుర్రాళ్ల ప్రాణాలు యెన్నితీశాయో ఆవ్యక్తిచేతులు! ఆకుర్రాడిమీద నున్న నగలువొలుచుకోవడమూ, ఆ పిల్లవాడి శవాన్ని మోటబావిలో పడెయ్యడమూకూడా చెప్పినంతసేపు పట్టలేదు ఆవ్యక్తికి. బంట్రోతు రంగడిని తరుముకొని వెళ్ళడంచేత దొరలాగ బయటికి వెళ్ళడానికి ఆవ్యక్తికి అభ్యంతరమేమీ కలగలేదు.

బంట్రోతు రంగడిని బాదుకుంటూ యింటికి తీసికొనివచ్చాడు ఒక అరగంటకి. అంతవరకూ యింట్లో వాళ్లెవరూ కుర్రాడిమాట తలపెట్టలేదు. ఎక్కడో ఆడుకుంటూ వుంటాడనుకున్నారు గాని, యింత కొంప ముంచుకొనిపోతుందని యెవరనుకుంటారు పాపం! కుర్రాడి పుట్టినరోజు పండుగ అనేమిషమీద యెవరి ఉత్సవములో వారున్నారు.

రంగడిని విచారించారు యింట్లో పిన్నపెద్దలందరూను. వాడు తనతప్పుమాత్రం తను వొప్పుకొన్నాడు. తక్కినసంగతి వాడికిమాత్రం యేం తెలుసును. 'కుర్రాడిని యిలా తీసుకురా' అని రంగయ్యనాయుడు కేకవేశాడు.

ఏడీ కుర్రాడు!

ఒక్కసారి అందరికీ చలనముకలిగింది. యింట్లో నాలుగుమూలలా వెదికారు. ఉహుఁ, కనపడలే. తోటలో వెదికారు. ఉహుఁ.

అప్పుడు ఆదుర్దాకలిగింది యింట్లోవాళ్ళకీ, బైటవాళ్లకీ కూడా. మళ్లీమళ్లీ వెతకటములో ఒకడి దృష్టి మోటబావిమీదకి పోయింది. నీళ్లల్లో సగం మునిగి తేలుతూవున్న రూపంకనపడ్డది. అతడుపెద్దకేకవేశాడు. అంతా చేరారక్కడికి. కుర్రాడి శవాన్ని బయటికి తీశారు. రంగయ్యనాయుడు మూర్ఛపోయాడు కొడుకును చూసి.

౬

మిఠాయిపొట్లం దొంగిలించడానికి పోయిన రంగడినెత్తిమీద ఖూనీకేసు పడింది. రెండు దెబ్బలుకొట్టి పంపుదామనుకున్నవాళ్ళంతా వాడిని చావగొట్టి పోలీసువాళ్ళకి అప్పగించారు. మిఠాయిపొట్లంకోసం నాలుగేళ్ళ పిల్లాడిని బావిలో తోసినవాడు, యెంత అమాయకుడైనా, యెంత చిన్నవాడైనా దయకు పాత్రుడౌతాడా! అందులో రావుసాహేబు రంగయ్య

నాయుడి యేకైకపుత్రుడిని చంపినవాడిమీద ఆవూళ్లో యెవరికైనా కనికారముఉంటుందా. 'ఎంతదుర్మార్గము! వెధవమిఠాయిపొట్లంకోసం నిక్షేపంలాంటి పిల్లాడిని వాడికడుపున పెట్టుకున్నాడు' అన్న అందరు ప్రజలతో పాటూ, నిక్షేపంలాంటి పిల్లాడిని తన కడుపున పెట్టుకున్న వ్యక్తికూడా అన్నాడు. అవును! దొరికినదాకా దొంగమాత్రం.

దొరకాడూ? 'మిఠాయిపొట్లం తీసుకొని పరుగెత్తడంతప్ప మరేమీ నేనెఱుగను' అంటాడు రంగడు. పోలీసువాళ్లు అడిగినా అదేచెప్పాడు. సబుమేజస్ట్రేటుకోర్టులో విచారణకీ అదే చెప్పాడు. నిజానికి వాడు అంతకన్న యేమెరుగును! కాని లోకం వాడిమాట నమ్మలా. సెషన్సుకోర్టుకు పంపించాడు సబు మేజస్ట్రేటు. సెషన్సుకోర్టులో మాత్రం రంగడితరఫున వాదించటానికి గవర్నమెంటువారే వొక వకీల్ని యేర్పాటుచేశారు.

'రంగడే నేరముచేసివుంటే పిల్లాడి మెళ్లోవున్న గొలుసు మాటేమిటి?' అన్నాడు రంగడిప్లీడరు.

'పొట్లం లాక్కు అని కుర్రాణ్ణి బావిలోకి తోసివుంటాడు. మెళ్లో గొలుసు బావిలో పడివుంటుంది' అంటాడు పబ్లిక్ ప్రాసిక్యూటరు.

'కేసు చెడిపోకుండా వుండేటందుకోసం కుర్రాడి చేతులకు గాజులువున్నట్లు రికార్డు చెయ్యలేదు పోలీసువారు. 'తోటలోనుంచి పరుగెత్తడంచూసే నేను వెంటబడ్డాను' అంటాడు బంట్రోతు.

'తరువాత మా యింట్లోకి యింకెవరూ రాలేదు' అంటారు ఒకరిద్దరు రంగయ్యనాయుడికి బంధుగులు.

'ఇంక, పిల్లాడిని ఎవరు చంపినట్లు?' అని సవాలు చేశాడు పబ్లిక్ ప్రాసిక్యూటరు.

'సాక్ష్యము బలంగాలేదు' అని సెషన్సుజడ్జి వాదములు, విచారణలు, క్రాసులు, అన్నీ అన్నికేసులలోలాగనే సక్రమముగా జరిగాయి.

ప్రత్యక్షసాక్ష్యము లేదు. తాత్కాలికసాక్ష్యము మీద ఆధారపడి శిక్షచెప్పాలి జడ్జి.

'నిందితుడు మంచిచెడ్డలను తెలిసికొనునంత మనోవికాసతలేని బాలుడైనందున, నిందితుని ఐదు సంవత్సరములు బోర్ట్సలుస్కూలునందుంచుటకు తీర్పు చెప్పుచున్నాను' అని లేచాడు జిల్లాజడ్జి. శిక్ష చాలావరకు తగ్గినందుకు రంగడి ప్లీడరూ, అసలు కేసు పోనందుకు పబ్లిక్ ప్రాసిక్యూటరూ సంతోషించారు.

రంగయ్యనాయుడికిమాత్రం మతిభ్రమణ కలిగింది. ప్రపంచ మతనికి అసహ్యమైపోయింది. రంగడికి శిక్షవేసినావొకటే, వెయ్యకపోయినావొకటే రంగయ్యనాయుడికి. బంట్రోతుమాత్రం రంగడికి శిక్షచెప్పేటంతవరకూ ఒక్కరాత్రి కూడా సరిగా నిద్రపోలేదు. 'ఇలాంటి తెలివితక్కువ జడ్జీలువుంటే న్యాయమెలా తగులడ్తుంది' అన్నాడు మహా విసుగుతో. తనలాంటి తెలివితక్కువ బంట్రోతును పెట్టుకొన్నందుకే రంగయ్యనాయుడి కొంపకూలిందని తెలియదు వాడికి. కాని నిజంగా, ఆఖూనీచేసిన వ్యక్తిమాత్రం ఒకరిద్దరు సంగాతకాండ్లదగ్గర 'అలాంటి వెధవనౌకర్లని పెట్టుకోకూడదు' అన్నాడు విశ్వాసమేనా లేకుండా.

౭

బోర్ట్సలుస్కూలులోకి వెళ్ళిన రంగడికి యిదంతా ఒకమాయలాగకనిపించింది. సబ్ జైళ్లలోవున్నప్పుడు కొంచెంకష్టమనిపించిందికాని, బోర్ట్సలుస్కూలులోమాత్రం అంతా తనయీడుపిల్లలే అవడంచేత ఆటల్లోనూ, పాటల్లోనూ గడిపేవాడు కొంతకాలాన్ని. పనిచేసినప్పుడు పనేచేసేవాడు. ఆడినప్పుడు ఆడేవాడు. రోజూ పాఠాలు మాత్రం తప్పకుండా వల్లించేవాడు. తోటి బాలురందరిలోకీ మెఱుగనిపించాడు. సూపర్నెంటుకి దయగలిగేటట్టు ప్రవర్తించేవాడు.

తండ్రి నల్లనివాడైనా, రంగడితల్లిది మాత్రం బంగారంలాంటి ఛాయ. రంగడుకూడా తల్లినిపోలి పుట్టాడు. బోర్ట్సలుస్కూలోకి వచ్చినతరువాత కడుపునిండా దిగులులేని కూడు దొరకడంచేత, రక్తం బాగా వృద్ధయింది. నిగనిగలాడుతూ చక్కగా తయారయాడు. వాడి చక్కదనమూ, మంచినడతా చూసి, దొర రంగడిమీద అమితప్రేమతో వుండేవాడు. తన అనుమానం

తీర్చుకుందుకు రంగడిని చాలాసార్లు తనదగ్గిరకు పిలిపించి 'నువ్వు ఆకుర్రాణ్ణి బావిలో పడేశావా!' అని అడిగేవాడు. వెక్కి వెక్కి యేడుస్తూ రంగడు 'నేనెరుగనండి దొరగారూ. ఆ పొట్లంమాత్రం తీసుకొని పరుగెత్తేనండి' అనేవాడు. దొరమాత్రం ఆమాటనమ్మి, వాడికళ్లు తుడుచుకోమని, నానురొట్టె వొకటితెప్పించి యిచ్చేవాడు. రంగడికళ్లల్లోనేవుంది 'నేనంతపెద్ద నేరం చెయ్యగలవాణ్ణికాను సుమా' అనే భావాన్ని వెలువరించే తేజస్సు.

ఆస్కూలులో వృత్తిపనులు అన్నీ నేర్పుతారు. న్యాయమైన జీవితాన్ని అలవరించుకోవడానికి అనుకూలమైన పద్ధతులు అన్నీ బోధపరచి, తక్కిన పురజనులందరిలోనూ ఒకడివికమ్మని ఆశీర్వదించి పంపిస్తారు, శిక్షాపరిమితి తీరిన పిల్లల్ని ఆస్కూలుపాలకులు. ఈ స్కూలులో తరిఫీదు అయినవాళ్లకి చాలామట్టుకు సర్కారుద్యోగాలే దొరుకుతాయి; బాల్యములో చేసిన నేరమేగనుక, శిక్షపడ్డప్పటికీ యీస్కూలులో నడత బాగున్నదని సూపర్నెంటు యోగ్యతాపత్రిక యిస్తే చాలు.

రంగడికివున్న తెలివితేటలు చూసి అభివృద్ధిలోనికి రాగల కుర్రవాడని చదువుచెప్పించాడు సూపర్నెంటుదొర. తెలుగూ, యింగ్లీషూ రెండూ ఒకే కాలములో ఆరంభించాడు రంగడు. బహుశ్రద్ధగా చదివేవాడు.

జడ్జీవేసినశిక్ష ఐదు సంవత్సరాలు అయినప్పటికీ, జైలులో మంచినడతకు కొంతకాలము తగ్గింపబడినది. బోర్టనులు స్కూలుకు వెళ్లేటప్పటికి రంగడికి పన్నెండో యేడునిండింది. బోర్టనులుస్కూలునుంచి వదలిపెట్టబడేటప్పటికి పదునేడోయేడు వెళ్ళింది.

మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసయినట్లు సర్టిఫికెట్టూ, అనుసరణీయమైన నడత కలవాడని సూపర్నెంటుయిచ్చిన యోగ్యతాపత్రమూ రంగడికి ఆధారము. యౌవనములోకి అడుగువేస్తూవున్న వయస్సు రంగడిరూపానికి మెరుగుపెట్టింది. రంగడిమీద అమిత వాత్సల్యము కలిగినదొర జైలునుంచి విడుదలపొందేటప్పుడు రంగణ్ణిపిలిచి, 'రంగరావ్! ఇదిగో యీ పాతికరూపాయలు తీసుకో. చెన్నపట్టణములో మా తమ్ముడున్నాడు. కీలైన సహాయము చెయ్యమని వుత్తరము యిస్తాను. తీసికెళ్లు. ఇంకా పైకి చదువుకో' అని చెప్పి ఆ రూపాయలూ, ఆవుత్తరమూ, క్రొత్తచొక్కా, క్రొత్తపంచా యిచ్చి, ఆశీర్వదించి పంపించాడు. తమ్మడికి యిచ్చిన వుత్తరములో 'యీ కుర్రవానిని క్రైస్తవునిగా నొనర్చిన యితడు ఉత్తమ క్రైస్తవుడగునని నాయాశయము' అనికూడా వ్రాశాడు. సూపర్నెంటు దొర తమ్ముడు మదరాసులో ఒక కాథలిక్కు ప్రీస్టు.

ఐదు సంవత్సరములు తనకు అన్నమూ, విద్యా యిచ్చిన జైలుస్కూలునుంచి బయటపడేటప్పుడు రంగడు వీడ్కోలు యిస్తూ, కన్నీళ్లు విడువకుండా వుండలేకపోయాడు. ఆజైలే అతనికి జ్ఞానప్రదాయిని; జీవనప్రదాయిని, **Alma Mater.** పైపరికరాలతో నూతన జీవితాన్వేషియై మద్రాసుకు బయలుదేరాడు రంగడు-రంగరావ్.

౨

మధ్యాహ్నము రెండు గంటలకి మదరాసు పొలిమేరలోని జనసముద్రములో రంగడొకడు. ఆ మహాసముద్రములో యెటుపోవలెనో తెలియక కొంచెం తటపటాయించాడు. సూపర్నెంటుదొరతమ్ముడి యిల్లు నుంగంబాకములో వుంది. అక్కడికిపోయినచో తగిన సలహాలభించును.

చిటపటమని పెద్ద చినుకులతో ఆరంభమైంది, సాయంత్రము నాలుగుగంటలకు, మధ్యాహ్నమునుంచీ కారుమేఘాలతో కప్పేసిన వాన. సరిగ్గా ఆసమయానికి నుంగంబాకములో దొరచెప్పిన చిరునామా గుర్తువుంచుకొని, యింటినెంబరు వెతుకుతూ రోడ్డుమీద నడుస్తున్నాడు రంగడు. వాన ఆరంభంకావడము తోటే కట్టుకున్నబట్టలు తడిసిపోతాయని ఎదురుగుండా కనిపించిన పెద్దమేడఅరుగుమీద నుంచుని వానవెలిసినతరువాత పోవచ్చునని ఒక్క పరుగుదీశాడు ఆమేడలోకి.

ఎత్తయిన ప్రహరీగోడమధ్యవున్న దామేడ, ఆరోడ్డుమీది అన్ని మేడలలాగే. చుట్టూ పూలమొక్కలూ, అపి

గోముగా పెరిగివున్నాయి. ముంచుకొని వస్తున్నవానలో గబగబ అరుగుమీదకి పరుగెత్తాడు రంగడు. అరుగుమీద అడుగు పెట్టాడో లేదో 'బొంయి' మంటూ రెండు బొచ్చుకుక్కలు మీద పడ్డాయి. ఒకటి కాలు పట్టుకుంది. రెండోది మెడపట్టుకొందుకు మీదకి ఎగురుతోంది. 'అమ్మయ్యో' అని కేకవేసి క్రిందపడ్డాడు గుండెలుచెదిరిన రంగడు.

'ఆః, ఆః, ఇజ్జా, ఇజ్జా, రాజా, రాణీ' అని కుక్కల్ని పిలుస్తూ, లోపల్నించి పద్నాలుగేళ్ల చక్కని చుక్కవొకతె బైటకువచ్చింది. ఆమెను చూడగానే తోకలు ఆడిస్తూ, రంగడినివదలిపెట్టి రెండుకుక్కలూ ఆమెదగ్గరికి పోయాయి. క్రిందబడ్డరంగడు స్పృహలో లేడు. కుక్కల అలుపుకే వాడు అదిరిపోయాడు. పైగా కాలిమీద ఒకకుక్క కరిచిందికూడాను.

'అయ్యో, అయ్యో' అంటూ లోపలికివెళ్ళి పనిచేసేదానిని తీసుకొచ్చింది ఆ అమ్మాయి.

'కరిచిందండి కాలిమీద' అంది పనిచేసేది. 'అయ్యో, పాపం' అంటూ లోపలికివెళ్ళి, టెలిఫోను తీసి డాక్టరు అవధానిని అర్జంటుగారమ్మని, మళ్ళీ రంగడివద్దకు వచ్చింది ఆ అమ్మాయి. ఇంతట్లో ఆ అమ్మాయి తల్లీ, తోటమాలీ కూడా అక్కడకు వచ్చారు. తోటమాలీ, పనిచేసేదీ, యిద్దరూకలసి మెల్లిగా రంగడిని లేవదీసి నడవలో సోఫామీద పడుకోబెట్టారు. కొంతసేపటికి డాక్టరు అవధానీ కూడావచ్చి కాలికికట్టు కట్టి కొంచెం కాఫీయిమ్మనిచెప్పి వెళ్లాడు. డాక్టరు వచ్చేటప్పటికి రంగడికి బాగా తెలివివచ్చింది. నువ్వెవరు అని ఎవరూ రంగడిని అడగలేదు. ఆసోఫామీదే పడుకొనివుండి పోయాడు బహునీరసంగా. అరగంటలో కాఫీ తయారుచేసి తెచ్చియిచ్చింది ఆఅమ్మాయి. గ్లాసు తీసుకొని త్రాగాడు రంగడు. అంతసేపూ రంగడికేసి వింతగా చూస్తూ నిలబడిపోయింది ఆ అమ్మాయి.

౯

రంగడు నాలుగున్నర సంవత్సరాలనించి నూపక్నెంటునోరభార్యని తప్ప రెండో ఆడదానిని చూసియెఱుగడు. అంటే స్త్రీపురుషులకు అన్యోన్యంగా వుండే ప్రపంచధర్మాన్నికూడా యెఱుగడన్నమాట. అందం అనేమాటయొక్క నిర్వచన మేమిటో బొత్తిగా వాడికి తెలియదు.

ఆ అమ్మాయిని చూసేటప్పటికి తను యెన్నడూ యెఱుగనిభావం ప్రవేశించింది వాడి హృదయములో.

ఆమేడ శ్రీపతిరావునాయుడిది. అసలు కాకినాడ అయినప్పటికీ, రంగూనులో చాలకాలము వ్యాపారముచేసి లక్షలకొద్దీ గణించి, ప్రస్తుతము మద్రాసులో ఆమేడకట్టుకొని కాపురమున్నాడు శ్రీపతిరావునాయుడు. ఇప్పుడు పురజన ప్రముఖులందరిలోనూ తనొకడు.

ఆరున్నర అయేటప్పటికి పట్నంలోకి వెళ్ళిన శ్రీపతిరావునాయుడు యింటికివచ్చాడు. సాయంత్రము జరగిన సంగతంతా విన్నాడు. రంగడుపడుకున్న సోఫాకి యెదురుగా కుర్చీవేసుకొని రంగడి చరిత్ర అడిగాడు నల్లపూసంతకూడా దాచకుండా రంగడు తన కథంతా చెప్పాడు. వాడికళ్లు రెండూ నీళ్లుకమ్మాయి. శ్రీపతిరావునాయుడికళ్లుకూడా నీళ్లుకమ్మాయి. తండ్రి కుర్చీవెనకాల, కుర్చీని రెండుచేతులతోటీ పట్టుకు నిలుచున్నమణి - ఆ అమ్మాయి - పైటకొంగుతో తనరెండు కళ్లూ తుడుచుకొంది.

రంగడిమాటల్లో వాళ్ళకేమీ అపనమ్మకం తోచలేదు. కులాభిమానము లేనివాడు జగతిలో లేడు. కులస్థుడైన రంగడి కథవిన్న శ్రీపతిరావునాయుడికి రంగడిమీద మహాదయకలిగింది. పుత్రులులేని అతనికి యేమో అనిపించింది. చిన్నప్పుడు విధికృతముచేత కొన్ని చెడ్డ పనులుచేసినా, పెద్దవారైనతరువాత బుద్ధిమంతులు వాటిని మరిచిపోతారని శ్రీపతిరావునాయుడి నమ్మకం. మణికి రంగడికథ వినేటప్పటికి, వాడినిజాయితీకీ, ఓర్పుకీ, ఎక్కువగా వాడి చక్కదనానికీ యేమేమో అనిపించింది. ఏవేవో వూహలు క్రొత్తగా పుట్టాయి.

కాలు బాగా నయమయేదాకా రంగడికి వాళ్లు చేసిన వుపచారాలు అన్నీయిన్నీకావు. మాయింట్లోనే

వుండి చదువుకో అని రంగడిని కాలేజీలో చేర్పించాడు శ్రీపతిరావునాయుడు.

మణి అప్పుడు నాలుగో ఫారం చదువుతోంది. వారానికి వొకసారైనా సూపర్నెంటు దొరకి వుత్తరం రాశేవాడు రంగడు.

తమ్ముడిని చూడటానికి సెలవుదీసికొని సంగం బాకమువచ్చినదొర నాయుడియింటికికూడా వచ్చి రంగడి అభివృద్ధికి చాలా సంతోషించాడు.


దొరతోటి రంగడివిషయమై యేమేమో చాలా సేపు మాట్లాడాడు శ్రీపతిరావునాయుడు మణిని దగ్గర పెట్టుకొని వాళ్లు మాట్లాడినంతసేపూ ఎర్రబడ్డ చెక్కిళ్లతో మణి తలవంచుకునే వుంది.

౧౦

నాలుగేళ్లు గడిచాయి.

రంగారావుకునూ, మణికినీ వివాహము జరిగింది. విందుకువచ్చిన పెద్దలలో సూపర్నెంటు దంపతులు ముఖ్యులు.

అదృష్టంకానీ, దురదృష్టంకానీ రావలసినప్పుడు వాటంతట అవే వస్తాయి. రానప్పుడు వాటిజాడకూడా తెలియదు.



పల్లెటూరి సంసారము —టి. కేశవరావు.